ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025
5
అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్


మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారులు, ప్రజలందరి సహకారంతో జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిగా నివారించేందుకు కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎస్పీ పి.జగదీష్ తెలియజేశారు. శుక్రవారం ఉదయం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్సీవోఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను, ఎస్పీ నిర్వహిస్తున్న సోషల్ మీడియా గ్రూపులో జిల్లా అధికారులు భాగస్వాములు కావాలన్నారు. అందులో ప్రభుత్వ పథకాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు ఇతర తదితర అంశాలపై సమాచారం ఉంటుందన్నారు. ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు చెందిన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలే వినియోగించుకోవాలన్నారు. నాశ ముక్త్ భారత్ అభియాన్ కింద అనంతపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డి-అడిక్షన్ వార్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వార్డుకు సంబంధించి ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని జిజిహెచ్ సూపరిండెంట్‌కు సూచించారు. వివిధ శాఖలకు చెందిన హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ఐపి అడ్రస్, ఆ ఫీడ్‌ను ఎస్పీ, కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు పంపించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మదకద్రవ్యాలకు సంబంధించి జనవరి 17వ తేదీ నుంచి ఫిబ్రవరి 21 వరకు మూడు కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపామన్నారు. వారినుంచి 5.100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సైబర్ సురక్షపై గత వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డిటిసి వీర్రాజు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దశాబ్దంలో ఏడేళ్లు కరువే..!



◆ కానరాని శాశ్వత నివారణ చర్యలు
◆ కరువు మండలాల ప్రకటనలతోనే సరి
◆ అన్నదాతకు అన్ని విధాలా నష్టం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త జిల్లా ప్రకారం అనంతపురం జిల్లాలో మొత్తం 31 మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో ఏటా కరువు పరిస్థితులే నెలకొన్నాయి. అంతకు మునుపు ఏడాది మాత్రం 28 మండలాల్లో కరువును ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఏడు మండలాలు, ఈ ఏడాది నాలుగు మండలాలు కరువు మండలాలు ఉన్నాయి. ఇలా నిత్యం వర్షాభావంతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

పదేళ్లలో ఏడేళ్లు కరువు

పది సంవత్సరాలు అంటే 2013-14 సంవత్సరంలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 2014-15 సంవత్సరంలో 31 మండలాలు, 2015-16లోనూ 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. 2015-16, 2016-17, 2017-18, 2018-19, తాజాగా 2023-24 ఏడు సంవత్సరాలు



కరువు నెలకొన్నాయి. మధ్యలో 2019-20, 2020-21, 2021-22 సంవత్సరాల్లో మాత్రమే వర్షాలు ఒక మోస్తరు పడటంతో కరువు జిల్లాలో నెలకొనలేదు.

కరువు నివారణ చర్యలు నామమాత్రమే..

తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో పాలకులు కరువు నివారణ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టులు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండింటి పరిస్థితి దయనీయంగానే మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ



మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో నీటిని జిల్లాకు తీసుకురావడంలో అనేక అవాంతరాలు ఏర్పడుతూనే ఉన్నాయి. ఆధునీకరణ పనులను వైసిపి ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. మరో ఐదేళ్లు ఈ పనులు చేపట్టేందుకు వీల్లేదన్న షరతు కూడా పెట్టింది. దీంత ఆధ్వాన్నంగా ఈ కాలువలో పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. హంద్రీనీవాను ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతున్నట్టు వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. కాని పనులు ప్రారంభమవలేదు. దీంతో ఈ కాలువలోనూ అరకొర నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఈ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ వెడల్పు పక్కన పెట్టింది. రెండవ దశ లైనింగ్ పై మాత్రమే శ్రద్ధ పెట్టింది.

సమగ్రాభివద్ధిపై చర్చ జరగాలి

వ్యవసాయాధారిత జిల్లా అనంతపురం. నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా అభివద్ధి, వెనుకబాటుతనంపై రాష్ట్ర బడ్జెట్ సమయంలో చర్చ జరగాల్సి ఉంది. జిల్లా సాగు నీటికి ప్రాధాన్యత కల్పించాలి. కరువు నివారణ చర్యలు చేపట్టి జిల్లా రైతాంగాన్నీ, ప్రజలను ఆదుకోవాలి.

ఓ.నల్లప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శి.



ఎస్‌కెయులో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు రద్దు చేయాలి

ఎస్‌కెయులో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా పీజీ విద్యార్థులకు సంబంధించిన కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్‌ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, ఎస్‌కెయు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, వంశీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్‌లకు సంబంధించి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ వల్ల యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయని, విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందంటూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌ను రద్దు చేసి యూనివర్సిటీలకు అడ్మిషన్‌లు చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చక పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ రద్దు చేయకుండా తిరిగి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారన్నారు. కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ వల్ల రాష్ట్రంలో యూనివర్సిటీలకు పూర్తిగా అడ్మిషన్ తగ్గిపోయాయని, చాలా విభాగాలు మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో దాదాపు నాలుగైదు విభాగాలు మూతపడ్డాయని తెలిపారు. కావున పీజీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రద్దు చేసి యూనివర్సిటీలకే అడ్మిషన్‌లు చేసుకునేలా పూర్తి అధికారాలు అప్పగించాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థులు పీజీ ప్రవేశాలు చేసుకోవడం వల్ల యూనివర్సిటీలో ఆర్థికంగా బలోపేతమయితాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి పీజీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోము, సాయి, శ్రీకాంత్, అభిషేక్, అశోక్, ప్రుద్వి, అజయ్, మహేష్, తిరుమలేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌పై కలెక్టర్ సూపర్‌చెక్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్‌లోని కందుకూరు, సోములదొడ్డి గ్రామాల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్‌పై సూపర్ చెక్‌ను కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ శుక్రవారం నిర్వహించారు. కందుకూరు గ్రామ పరిధిలో రైతు వై.మురళి కృష్ణకు చెందిన సర్వే నంబర్ 304/2ఏ రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. సోములదొడ్డి గ్రామ పరిధిలోని రైతు మడూరు రఘు రాములు ఒక ఎకరా పొలంలో వరి పంట సాగు చేశారు. ఈ పంటల వివరాలను సూపర్‌చెక్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్‌లో పంట నమోదును పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఏడీఏ రవికుమార్, తహశీల్దార్ హరికుమార్, ఏవో బాల నాయక్, వ్యవసాయ అధికారి శశికళ, ఏఈవో మురళీకృష్ణ, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

టిడిపి సోషల్‌మీడియా ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేత

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్న టిడిపి సోషల్ మీడియా విభాగం ప్రతినిధులను రాష్ట్ర పార్టీ ఘనంగా సత్కరిస్తూ పార్టీ గుర్తులతో కూడిన పసుపు జెండా జ్ఞాపికలు పంపింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురికి శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణంలోని తన నివాసంలో వాటిని అందజేశారు. పార్టీ తమ సేవలను గుర్తించి జ్ఞాపికను ఎమ్మెల్యే ద్వారా అందజే యడం చాలా గౌరవంగా ఉందని గ్రహీతలు హర్షం వ్యక్తం చేశారు.



అనంతపురంలో గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను పరిశీలించి అక్కడ సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

గ్రూప్-2కు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. అనంతపురం నగరంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే ఎస్-ఎస్‌బిఎన్, ఎస్‌వి డిగ్రీ కళాశాలల్లో ఏర్పాట్లను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. కళాశాలల్లో సీసీటీవీ కెమెరాలు అన్ని పనిచేసేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని దొడగట్ట రోడ్డులో టూ టౌన్ పోలీసులు, ఆటో డ్రైవర్ల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయగా శుక్రవారం సిఐ యువరాజు ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పా టు చేయడానికి చొరవ చూపిన ఆటో డ్రైవర్లను అభినందించారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనియన్‌ను బలోపేతం చేసుకోవాలని, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలన్నారు. ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సొంత డబ్బుతో ఐదుగురు డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, యూనిఫామ్ అందజేస్తానన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే తనను కలిస్తే డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని 74-ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 22వ తేదీ కొత్తగా ఎ.బి స్విచ్‌లు ఏర్పాటు చేస్తుండడంతో శనివారం ఉదయం 8:30 నుంచి 12:30 దాకా బిఎన్.హళ్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ బాలచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుమ్మగట్ట మండలంలోని భూపసముద్రం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధ్యయనంతోనే అభివృద్ధి సాధ్యం

◆ జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ◆ బీ ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి -అనంతపురం

ఔషధ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను ఫార్మసీ విద్యార్థులు అధ్యయనం చేయడం ద్వారా ఈ రంగంలో అభివృద్ధి సాధించగలమని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తెలిపారు. జెఎన్‌టియుఎ అనుబంధ కళాశాల తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ సంచాలకులు జివి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 2024 బీఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఔషధ శాస్త్రంలో కత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసన ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. ఒటిపిఆర్ఐ సంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డా॥సి.గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి అన్ని కార్యక్రమాలను నిర్దిష్ట ప్రణాళికతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్‌తో పాటు బోధన, బోధనేతర, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య



ఫ్రెషర్స్‌డేలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని



సోలార్ సిస్టమ్స్ షోరూంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

సోలార్ సిస్టమ్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సుమ సోలార్ సిస్టమ్స్ షోరూంను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. కాలవ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో గృహ, వ్యవసాయ, వాహన, వాణిజ్య, ఇతరత్రా రంగాల్లో సోలార్ విద్యుత్ కీలకంగా మారిందన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా డీలర్లు కండే గోపి, వెంకటేశులు, శ్రీనివాసులు, ధనుంజయ స్థానికంగానే సోలార్ పరికరాలను ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని అభినందించారు. పిఎం సూర్య ఘర్, సోలార్ ఎక్విప్మెంట్, ఇండస్ట్రియల్ సోలార్ సిస్టమ్స్ విక్రయిస్తున్నట్లు షోరూం సుమ సోలార్ యజమాని కండే గోపి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతరెడ్డి, పురుషోత్తం, వెంకటేశులు, సిమెంట్ శీన, తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు అవార్డులు ఇస్తాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పదో తరగతి పబ్లిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యే శుక్రవారం పట్టణంలోని ప్రజావేదికలో డిఇఓ ప్రసాద్‌బాబు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఆచరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించారని, అలాంటి వాటిపై నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైసిపి హయాంలో జరిగిన నాడు-నేడు పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. అనివార్య కారణాల వల్ల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేకపోతే ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయివేటు పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా కనీస సౌకర్యాలు కల్పించాలని, నిధుల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే నిధులు కేటాయించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం కెజిబివిల నిర్వహణపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పలు పాఠశాలల్లో నిర్వహణ సక్రమంగా లేదని విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు, హిందీ శాఖల ఆధ్వర్యం లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ డి.జయరామిరెడ్డి మాట్లాడుతూ మాతృభాష వ్యక్తి వికాసం, జాతి పురోభివృద్ధికి సంకేతంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శేషయ్య తెలుగు భాష గొప్పతనాన్ని వివరించి, కవితలు, పద్యాలు చెప్పారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎంటి జ్యోత్స్న మాట్లాడుతూ జాతి, సంస్కృతి, సంప్రదాయాలకు భాష చిహ్నమన్నారు. హిందీ శాఖ అధ్యాపకులు షౌకత్‌అలీ మాతృభాష ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. తెలుగు అధ్యాపకులు గోపి మాట్లాడుతూ పరభాష ద్వారా నేర్పే విద్య సోపానాలు లేని సౌధం వంటిదని ప్రాథమిక విద్యాభ్యాసం అంతా మాతృభాషలో కొనసాగితే విద్యార్థిలో సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కవిత, డాక్టర్ శశికిరణ్, డాక్టర్ రవిశంకర్, సుధాకర్, జయమ్మ, రామాంజనమ్మ, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా. రఘురామ్మూర్తి మాట్లాడుతూ మాతృభాష ఆ జాతి ఉనికి, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతుందనారు. భావవ్యక్తీ కరణకు మాతృభాష ఉపయోగపడి నట్లుగా పరభాష ఉపయోగ పడదన్నారు. అనంతరం కవితలు, సామెతలు, జానపద గేయాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, నారాయణ, మల్లికార్జున, కోదండరాములు, సునిల్‌కన్నా, దేవదాస్, పాలరాజ్, బాబు, ఎన్ఎస్ఎస్ పిఒ నాగప్ప, ఉమర్‌షరీఫ్, రఘు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



కలెక్టర్ వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యే సురేంద్రబాబు

కలెక్టర్‌కు ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

హంద్రీనీవా కాలువ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు హంద్రీనీవా కాలువ పనులపై జిల్లా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొంత భూసేకరణ పనులు చేపట్టాల్సి ఉందని, రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ హంద్రీనీవా ప్రాజెక్టు పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి సర్వే నిధులు, పరిహారం మంజూరు కేటాయింపులపై తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపి పనులు ప్రారంభిస్తామన్నారు. వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే సమస్య ఉందని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధికారులతో సమీక్షించి ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఇదివరకూ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఎలాంటి సమస్యలు వచ్చాయి, వాటి పరిష్కారం, తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. సమీక్షలో ఆర్డీవో వసంతబాబు, డివిజనల్ పరిధిలోని తహశీల్దార్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన కృష్ణమూర్తిశెట్టి హత్యకు గురై రెండు నెలలైనా వారి కుటుంబానికి న్యాయం జరగలేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నాగ రాజు తహశీల్దార్ రీసర్వే చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించని కారణంగానే కృష్ణమూర్తిశెట్టి హత్య జరిగిందని, ఈ హత్యకు తహశీల్దార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ వారి విషయం కోర్టులో ఉన్నందున నా పరిధిలో ఏమీ చేయలేనని తెలిపారు.

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్


వినతిపత్రం అందజేస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈమేరకు శుక్రవారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో ఉన్న పిహెచ్‌సిని పరిశీలించారు. అనంతరం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని స్టాఫ్‌నర్సుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న పిహెచ్‌సిల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. పదిరోజుల నుంచి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. తరిమెల ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డాక్టర్ అందుబాటులో లేక రక్త పరీక్షలు చేయడం లేదన్నారు. అలాగే వైద్యశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలి, పెద్దన్న, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై పోరాటం

ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు


బీడీ కార్మికులతో మాట్లాడుతున్న జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు డిమాండ్ చేశారు. నగరంలోని రమేష్‌రెడ్డి కాలనీ, పాతకోట, పడమటిగేరి, కాలువగడ్డ వీధి, టైలర్స్ కాలనీల్లో శుక్రవారం స్థానిక సిఐటియు నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రిలో అధికశాతం బీడీ కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. బీడీ కార్మికులకు సెంట్రల్ వేజ్ బోర్డు ప్రకారం వెయ్యి బీడీలకు రూ.500 ఉండగా ఆయా కంపెనీ యాజమాన్యాలు కేవలం రూ.300 కూడా ఇవ్వడం లేదన్నారు. అరకొర వేతనాలతో నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, కరెంట్ బిల్లులు చెల్లించలేక బీడీ కార్మికులు దుర్భర పరిస్థితులు గడుపుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లస్థలాల కోసం అనేక మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నా స్థలాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీడీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమాగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్, సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి, బీడీ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

అనంతపురం క్రైం : యూనివర్సిటీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఎపి రాష్ట్ర ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అదనపు నిధులు విడుదలలో జాప్యం వల్ల యూనివర్సిటీ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు మంజూరు కాలేదని, 8యూనివర్సిటీల నిధుల కోసం పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉండటం వల్ల జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లో యూనివర్సిటీలు ఉన్నాయన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

'సమాజ క్రాంతి' సేవలు అభినందనీయం

అనంతపురం : ప్రజా కళాకారుడు ఎస్‌కె లెనిన్‌బాబు ఏర్పాటు చేసిన సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో సమాజ క్రాంతి ట్రస్టు రూపొందించిన బ్రోచర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ క్రాంతి ట్రస్టు ద్వారా కుందుర్పి మండల వ్యాప్తంగా మొక్కలు నాటి సంరక్షించడం, గ్రామీణ ప్రాంత మహిళలు, యువత కోసం టైలరింగ్, డ్రైవింగ్ లాంటి స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు సామాజిక బాధ్యతను పెంపొందించడానికి 23 గ్రామాల్లో విలువల బడులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు రవికాంత్ రమణ, ఎజిఎస్ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎజి ప్రమీలమ్మ, ట్రస్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పరస్పర సహకారం

జిఆర్‌పి ఐజి కెవి మోహన్‌రావు


మాట్లాడుతున్న జిఆర్‌పి ఐజి కెవి మోహన్‌రావు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైళ్లలో తరచూ జరుగుతున్న నేరాల నియంత్రణతోపాటు ఛేదించేందుకు రాష్ట్రాల హరిహద్దుల పోలీసుల పరస్పర సహకారం అవసరమని జిఆర్‌పి ఐజి కెవి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం గుంతకల్లు రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైళ్లలో తరచూ జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు ఈ సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. రైళ్లలో నేరాలకు పాల్పడిన క్రిమినల్ గ్యాంగులు అవే రైళ్లలో మరొకచోటుకు వెళ్తుంటారన్నారు. నిందితులను పట్టుకోవడానికి పక్కరాష్ట్రాలు, జిల్లాల పోలీసుల సహకారం ఎంతో అవసరం ఉంటుందన్నారు. కావున కర్ణాటక,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల జీఆర్పి, ఆర్పిఎఫ్, సివిల్ పోలీసుల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం డిఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో కర్ణాటక, ఆంధ్ర రైల్వే డివిజన్ పరిధిలోని జిఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంతకల్లు జిఆర్పి ఎస్పీ రాహుల్ మీనా, తిరుపతి జిఆర్పి డీఎస్పీ హర్షిత, నెల్లూరు జిఆర్పి డిఎస్పీ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు 'ఉపాధి' పనులు కల్పిస్తేనే కూలీలకు లబ్ధి

డ్వామా పీడీ ఎన్.సలీంబాషాకు వ్యకాసం నేతల వినతి


డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు అదనంగా 50 రోజులు పనిదినాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేవలం ఏడు మండలాలకు మాత్రమే అదనంగా 50 రోజుల పని దినాలు కల్పించడం సరైంది కాదన్నారు. జిల్లావ్యాప్తంగా 100 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారందరికీ అదనంగా 50 రోజులు పని దినాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఏడువారాలు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని, సాఫ్ట్‌వేర్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వారం వారం బిల్లులు చెల్లించాలన్నారు. గ్రామాలలో ప్రతి శుక్రవారం కూలీలు మేట్లకు సమావేశాలు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కర్, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ

అనంతపురం : గార్లదిన్నె మండల కేంద్రంలోని నారాయణ స్కూల్ (అక్షర స్కూల్)లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడోత్సవాల్లో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు కేవలం రాష్ట్రస్థాయిలోనే కాకుండా దేశం, ప్రపంచ స్థాయిలో తెలుగు వారి ప్రతిభను చాటుతున్నాయన్నారు. ఓ వ్యక్తి కృషి, పట్టుదల, అంకితభావంతోనే ఇంత ప్రఖ్యాతి పొందిందన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

శింగనమల : రానున్న వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలను జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక కేంద్రం వైద్యులు శంకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి తీవ్రతరంగా ఉంటుందన్నారు. అందుకు తగ్గట్టుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల ఆరోగ్య పరిస్థితిని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వర్థనారాయణ, ఎఎన్‌ఎం శైలజ, స్టాఫ్ సిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండలం ఆలమూరు పంచాయతీ పరిధిలోని అనంతపురం-తగరకుంట ప్రధాన రహదారి నుంచి ఎంబి.పల్లి గ్రామం వరకూ రూ.2.50కోట్లతో నిర్మిస్తున్న బిటి, సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు సూరి, మాజీ జడ్పిటిసి వేణుగోపాల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జగదీష్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటియు అనుబంధ పారిశుధ్య కార్మికుల సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్, ప్రయివేట్ ఏజెన్సీలను రద్దు చేసి వాటి ఆధీనంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆయా డిమాండ్ల సాధనకై మున్సిపల్ కార్మికులను కలుపుకుని దశలవారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రధానంగా మున్సిపల్ కార్మికులకు పనిముట్లు, తోపుడుబండ్లు, సబ్బులు, దుస్తులు ఇవ్వాలని పల్లుమార్లు కమిషనర్‌కు విన్నవించుకున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికులు అడగకపోయినా ఇవ్వాల్సిన పనిముట్లను మూడేళ్లుగా ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, ఇంక్రిమెంట్లు, అరియర్స్ బిల్లులను ఇవ్వాలన్నారు. పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, 60ఏళ్లు దాటిన కార్మికులకు, మరణించిన కార్మికులకు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నరసయ్య, నాయకులు రంగనాయకులు, ఎర్రమ్మ, కృష్ణ, దాసు, శామ్యూల్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : మండల కేంద్రంలోని మోడల్ (ఆదర్శ) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు మార్చి 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్..90309 58771 ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

యాడికి : జాతీయ అంధత్వ నివారణలో భాగంగా మండల కేంద్రంలోని సిఎస్ఐ పాఠశాల మండల పరిధిలోని నిట్టూరు, ఎన్.చిక్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు ఉదయభాస్కర్, డివిఎన్.శర్మ, లక్ష్మీ, నారాయణ, వై.భారతి, మీరా, మురళీకృష్ణ, భాస్కర్‌రెడ్డి, పిఎస్ఐ స్కూల్ హెడ్‌మాస్టర్ జయప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకత అవసరం

న్యూజిలాండ్ ప్రతినిధులు



బెలుగుప్ప విద్యార్థులతో డెన్మార్క్ ప్రతినిధులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకంగా ఆలోచిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని న్యూజిలాండ్‌కు చెందిన మైకేల్ డెన్మార్క్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలను న్యూజిలాండ్‌కు చెందిన ట్రాన్సిడెంటల్ మెడిటేషన్ గ్లోబల్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ శిక్షకులు మైఖేల్, డెన్మార్క్‌కు చెందిన డొమినిక్, పేర్లే సందర్శించారు. రాష్ట్రంలోని పాఠశాలలకు భావోద్వేగ స్థిరత్వం సృజనాత్మకత, మేథోసామర్థ్యాన్ని పెంచే విప్లవాత్మక పద్ధతిని పాఠశాలలకు అందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తమ ఆర్గనైజేషన్ ఉద్దేశాలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, హెచ్‌ఎం సుమ, శ్రీనివాస విద్యానికేతన్ కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసులు



బెలుగుప్ప : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా మండలానికి చెందిన పాటిల్ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతానన్నారు. వైసిపి మండల నాయకులు, జెడ్పిటిసి మమత త్రిలోకనాథరెడ్డి, మండల అధ్యక్షులు చిన్న మచ్చన్న, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

విష జ్వరాలపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పరిసరాల పరిశుభ్రత తోపాటు వ్యక్తిగత పరిశుభ్రత డ్రై డే ఫ్రైడే ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షబ్బీర్ అహ్మద్, సరోజమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి

భరతనాట్యంలో 'శ్రీచైతన్య' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్లో నిర్వహించిన భరతనాట్యంలో నగరంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థిని అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3000 మందిపైగా విద్యార్థులకు భరతనాట్యంలో పాల్గొనగా నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న గగనశ్రేయ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. దీంతో శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుం, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, ఎఒ గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ చెక్కు పంపిణీ

అనంతపురం రూరల్ : బుక్కరాయసముద్రం మండలం జంతులూరు గ్రామానికి చెందిన దూదేకుల కరింబీకి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.5,37,157 చెక్కును శుక్రవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

రైతులను పరామర్శించడం నేరమా..?

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నష్టాల్లో ఉన్న మిర్చి రైతులను మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శిచడం నేరమా..? అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రభుత్వం కుట్రలకు దిగిందన్నారు. గుంటూరు మిర్చి యార్డులో రైతులను పరామర్శించేందుకు వెళ్లిన జగన్‌కు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. భద్రత కల్పించకపోగా 'ఇల్లీగల్ యాక్టివిటీస్'కు భద్రత కల్పించలేమని చంద్రబాబు పేర్కొనడం శోచనీయమన్నారు. రైతులను పరామర్శించడం చంద్రబాబు దృష్టిలో ఇల్లీగల్ యాక్టివిటీసా..? అని నిలదీశారు. గత వైసిపి పాలనలో 24 పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధర కల్పించిందన్నారు. అలాగే విజయవాడలో జగన్‌తో ఫొటో దిగిన చిన్నారిపై సోషల్ మీడియాలో టిడిపి సైకోలు దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అమ్మఒడి వస్తోందో.. రాలేదో.. నారాయణ, చైతన్య స్కూళ్ల వద్ద అడిగినా చెబుతారని చురకలంటించారు. చిన్నారిపై ట్రోలింగ్ జరుగుతుంటే చంద్రబాబు, పవన్‌లు ఖండించరా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

28లోపు పి-4 సర్వే పూర్తి చేయాలి : ఎంపిడిఒ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

ఈనెల 28వతేదీలోపు మండల వ్యాప్తంగా పి-4 సర్వే పూర్తి చేయాలని ఎంపిడిఒ భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మండలంలో ఎంపిడిఒ సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా తరిమెల, కల్లుమడి గ్రామాల్లోని సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న పి-4సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. అంతేగాకుండా సచివాలయ సిబ్బంది ఇష్టమొచ్చినట్లు సెలవులు పెట్టకూడదన్నారు. అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ శ్రీదేవి, ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపిల్లలపై రాజకీయాలు తగదు...

అనంతపురం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిన్న పిల్లలపై కూడా రాజకీయం చేయడం అవమానకరమని శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సిఎం జగన్‌ను ఆప్యాయంగా పలకరించిన చిన్నారిని అధికార పార్టీకి చెందిన సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందడం బాధాకరమన్నారు. పసిబిడ్డలు, ఆడబిడ్డలకు అండగా ఉండాల్సిన హోంమంత్రి స్పందించకుండా ఉండటం ఏంటని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన వారిపై స్పందించిన ప్రభుత్వం పిసిబిడ్డను ట్రోల్ చేస్తున్నా ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకరికి ఒకలా.. మరొకరికి మరోలా స్పందించడం మంచిది కాదన్నారు. వెంటనే పసిబిడ్డపై ట్రోలింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు

శింగనమల : రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో పాడి రైతులకు గడ్డి విత్తనాలను సరఫరా చేస్తోందని తరిమెల పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల పశువైద్యశాలకు ఒక మెట్రిక్ టన్ను, తరిమెలకు రెండు మెట్రిక్ టన్నులు, సలకంచెరువుకు మూడు మెట్రిక్ టన్నులు, గార్లదిన్నె పశువైద్యశాలకు రెండు మెట్రిక్ టన్నులు, ఎర్రగుంట్ల పశువైద్యశాలకు రెండు మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు. గడ్డి విత్తనాలు కావాల్సిన రైతులు తమ పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో సమీప పశువైద్యశాలల్లో సంప్రదించి విత్తనాలను తీసుకోవాలని కోరారు.

టమోటా రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత


టమోటా పంటను పరిశీలిస్తున్న పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

టమోటా రైతులు ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. శుక్రవారం నగర సమీపంలోని ఆలమూరులో సాగు చేసిన టమోటా పంటను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా టమోటా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం 15 కిలోల బాక్స్ రూ.50 నుంచి రూ.వంద మాత్రమే పలుకుతోందన్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ టమోటా పంటకు గిట్టుబాటు ధరలు లేవనే ఆందోళన చెందొద్దని, మీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వేణుగోపాల్ ఆలమూరు సూరి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడు : మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామ పంచాయితీలో ఉన్న అయ్యవారిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత భూమిపూ చేయనున్నట్లు జెఆర్‌వి కిశోర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఫైనాన్స్ నిధులు రూ.40లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

తరిమెల వంశీగోకుల్‌రెడ్డికి అభినందనలు

శింగనమల : వైసిపి రైతు విభాగం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మండలానికి చెందిన తరిమెల వంశీగోకుల్‌రెడ్డికి రైతు విభాగం జిల్లా మాజీ కార్యదర్శి నీలం శివశంకర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. వంశీగోకుల్‌రెడ్డికి వైసిపిలో రాష్ట్రస్థాయి పదవి రావడం సంతోషకరమన్నారు.

రోగులను ఆప్యాయంగా పలకరించాలి

అనంతపురం సిటీ : వివిధ రకాల ఆరోగ్య రుగ్మతలతో సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులతో ఆప్యాయంగా వ్యవహరించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, సర్వజన ఆసుపత్రి ప్రధాన పర్యవేక్షకులు డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు సూచించారు. ఐవిఆర్‌ఎస్‌లో మార్కులు తక్కువగా ఉన్నందున కలెక్టర్ సూచనల మేరకు అడ్మినిస్ట్రేషన్, వైద్యులతో మెడికల్ కళాశాలలో సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐవిఎస్ఆర్‌లో మనకు కొద్దిగా లో గ్రేడ్ వచ్చిందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించే దిశలో అడుగులు వేయాలన్నారు. వైద్యులు డ్యూటీ టైంలో రోగులకు సరైన వైద్యం అందిస్తూ, వారిని చీదరించకుండా నవ్వుతూ మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అడ్మినిస్ట్రేషన్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైసిపి మండల కన్వీనర్

యాడికి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆయన నివాసంలో నూతనంగా నియమితులైన వైసిపి మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు, మాజీ జడ్పిటిసి వెంకటరామిరెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.చిదంబరయ్య, మనోహర్‌రెడ్డి, బుజ్జీ పాల్గొన్నారు.

ఊటకల్లులో ఆరాధన మహోత్సవం

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా కాశిరెడ్డినాయన ఆలయంలో తెల్లవారుజామున నుంచి అర్చకులు, అభిషేకం, అర్చనలు పూజలు చేశారు. తర్వాత గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజానాయుడు

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ, బి.పప్పూరు చెత్త సంపద కేంద్రాలతోపాటు పప్పూరులో 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించిన రచ్చకట్టను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజానాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ మండలంలోని అన్ని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంతేగాకుండా గ్రామీణ ప్రాంతా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే పొడి, తడి చెత్తను వేరు చేసి చెత్త బండ్లలో వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రయివేటు బస్సు బోల్తా..

పలువురికి గాయాలు-కుంభమేళాకు వెళ్లి వస్తూ ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో శుక్రవారం ప్రయివేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రయివేటు ట్రావెల్ బస్సులో కుంభమేళా తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులంతా బెంగళూరు, బాగేపల్లి, దొడ్డబళ్లాపూర్, అనంతపురానికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. క్షతగాత్రులలో తులసి, పుష్పావతి, లక్ష్మయ్య, మహాలక్ష్మి, పూర్ణిమాబాయి, రమేష్‌నాయక్, బస్సు డ్రైవర్ వినోద్, ప్రమీలా, అనంతపురానికి చెందిన ఉమాదేవి, స్కంద, గౌరీబిదనూరుకు వెంకటరమణప్ప, దొడ్డబల్లాపూర్‌కు చెందిన నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారందరిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తులసి, పూర్ణిమ, డ్రైవర్ వినోద్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.